నేడు జెఎన్‌టియులో ఆధునిక కంప్యూటర్ సైన్స్ సదస్సు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఆధునిక కంప్యూటర్ సైన్స్ సదస్సు ప్రారంభం కానుందని సదస్సు కోఆర్డినేటర్ ఎపి.శివకుమార్ తెలిపారు. అబ్దుల్ కలాం సెమినార్ హాల్ నందు సీఎస్ఈ, ఎసిటిఈ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఆధునిక కంప్యూటింగ్ (సూపర్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్) అనే అంశంపై మూడు రోజులు పాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి అధ్యక్షత జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య హెచ్.సుదర్శన రావు హాజరవుతారని తెలిపారు. 7న ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య హాజరవుతారని తెలిపారు. సదస్సులో నిపుణుల ప్రసంగాలు, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఉంటాయన్నారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం

◆ మున్సిపల్ కార్మికుల ఆందోళన ◆ అనంతలో మౌనప్రదర్శన, రాయదుర్గంలో భిక్షాటన

రాయదుర్గంలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని సోమవారం మేయర్ ఛాంబర్ దగ్గర ప్లకార్డ్స్ చేతబట్టి మౌన నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సిఐటియు నాయకులు నాగభూషణం, వెంకటనారాయణ, ముర్తుజ మాట్లాడుతూ పనిముట్లు, రెగ్యులర్ కార్మికులకు సంబంధించిన సరెండర్ లీవులు, బిల్లింగ్ సమస్యలతో సతమతం అవుతున్నారని తెలిపారు. 26 మంది కార్మికులకు జీతాలు పడని వారి సమస్యలు, పిఎఫ్ ఈఎస్ఐ, తప్పిదాలు సరిచేయాలని అన్నారు. పిఎఫ్‌ఎస్ సంబంధించిన కన్సల్టెంట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ డెత్ క్లెయిమ్లు పరిష్కారం చేయాలని కోరారు. అదనపు కార్మికులకు బకాయి ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. నగరానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సాంకేతిక సమస్యల పేరుతో ఉద్దేశపూర్వకంగానే వేతనాల్లో కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల ఇతర న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై మేయర్ స్పందించి నగర కమిషనర్, అడిషనల్ కమిషనర్‌ను పిలిపించి మాట్లాడారు. అధికారులు ఒక్కొక్కటిగా సమస్యల పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు ముత్యాలు, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నగర ప్రధాన కార్యదర్శి తిరుపలేష్, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు సభ్యులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన, భిక్షాటన

రాయదుర్గం : గత కొన్నేళ్లుగా పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శన, భిక్షాటన చేపట్టారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం నుండి కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ నాయకులు, కార్మికులు భిక్షాటన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదుర్గం పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐలో ఉన్న తప్పులను సవరించాలని, కార్మికులకు అందించాల్సిన పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, ఇంజినీరింగ్ కార్మికులకు టిఎ, డిఎలు అమలు చేయాలని, కార్మికులపై అదనపు పనిభారం మోపకుండా ఇంజినీరింగ్ విభాగంలో కార్మికుల సంఖ్య పెంచాలని, సమ్మె కాలంలో ఇచ్చిన హామీ ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచి, రిస్క్ అలవెన్స్ ఇస్తూ పని భద్రత కల్పించాలని కోరారు. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించి, ఎక్స్‌గ్రేషియా, డెత్ బెనిఫిట్స్ ఇప్పించాలని, కార్మికులందరికీ స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. అనంతరం కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన కమిషనర్ ఈనెల 10వతేదీలోపు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఐక్యల ఆదినారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లేష్, తిప్పేస్వామి, బసవరాజు, ఆదిలక్ష్మి, కామాక్షి, రమేష్, తిప్పేరుద్ర, నరసింహులు, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

మేయర్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులు

'పురం'లో క్యాంపు రాజకీయాలు

◆ త్వరలో మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక
◆ క్యాంపునకు బయల్దేరిన కౌన్సిలర్లు
◆ టిడిపితో జతకట్టిన 16 మంది వైసిపి కౌన్సిలర్లు

క్యాంపునకు వెళ్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాల్టీలో క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయి. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాగానే హిందూపురం మున్సిపాల్టీ పాలకవర్గం తీరు ఒక్కసారిగా మారిపోయింది. ఛైర్మన్ రాజీనామాతో ఇక్కడ నూతన పాలకవర్గం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఇందులో భాగంగా మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారింది. వైసిపి నుంచి పలువురు కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలోకి చేరడంతో ఛైర్మన్ గిరిని టిడిపి సొంతం చేసుకోవడం ఏకపక్షంగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. త్వరలోనే హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయినట్లు సమాచారం రావడంతో ఆ పార్టీ అధిష్టానం కౌన్సిలర్లను క్యాంపునకు తరలించింది. టిడిపి కౌన్సిలర్లతోపాటు 16 మంది వైసిపి కౌన్సిలర్లు టిడిపిలోకి చేరి ఆ పార్టీ కౌన్సిలర్‌లతో సోమవారం సాయంత్రం క్యాంపునకు బయలుదేరారు. గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా హిందూపురం మున్సిపాల్టీలో ఉన్న 38 వార్డుల్లో ఏకంగా 30 వార్డుల్లో అధికార వైసిపి కౌన్సిలర్లు విజయం సాధించారు. ఆరు వార్డుల్లో తెలుగుదేశం, చెరో ఒక వార్డులో బిజెపి, ఎంఐఎం అభ్యర్థులు గెలుపొందారు. ఎన్నికల అనంతరం బిజెపి, ఎంఐఎం అభ్యర్థులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. దీంతో టిడిపి బలం 8కి చేరింది. అప్పట్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్ ఇంద్రజను మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా మున్సిపాల్టీ ముఖచిత్రం మారిపోయింది. ఎలాగైనా మున్సిపాలిటీలో పట్టు సాధించాలని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇందులో భాగంగా పదిమంది వైసిపి కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీ కండువాను ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో కప్పుకున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఓటుతో తెలుగుదేశం పార్టీ బలం 20కి చేరుకుంది. తెలుగుదేశం పార్టీ ఛైర్మన్ అభ్యర్థిగా ఆరో వార్డు కౌన్సిలర్ డిఈ..రమేష్ కుమార్ పేరును ఎమ్మెల్యే ప్రతిపాదించారు. విజయవాడలో తుఫాన్ బీభత్సం కారణంగా మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ఆలస్యం కావడంతో టీడీపీలో చేరిన పదిమంది వైసిపి కౌన్సిలర్లలో నలుగురు తిరిగి సొంత పార్టీలోకి వెళ్లారు. దీంతో మళ్లీ తెలుగుదేశం బలం పడిపోయింది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం శ్రేణులు ఒకింత ఢీలా పడ్డాయి. ఛైర్మన్ స్థానాన్ని ఎమ్మెల్యే అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో టిడిపి శ్రేణులు తమదైన శైలిలో పావులు కదిపారు. తెలుగుదేశం పార్టీ ఛైర్మన్ స్థానాన్ని చేజిక్కించుకునేలా సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. దీంతో మళ్లీ వైసిపికి చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. కూటమి కౌన్సిలర్లతో పాటు వైసిపిలోకి చేరిన వారితో కలుపుకుని టిడిపి బలం 24కు చేరుకుంది. మున్సిపల్ ఛైర్మన్ స్థానం మళ్లీ తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా మారింది. మరో వారం లోపు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించే అవకాశం ఉండడంతో కౌన్సిలర్లు ఎవరూ చేజారిపోకుండా ఉండేలా తెలుగుదేశం అధిష్టానం ఆదేశం మేరకు స్థానిక సీనియర్ నేతలు కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. కూటమి కౌన్సిలర్లతో పాటు వైకాపాకు చెందిన 16 మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లినట్లు సమాచారం. మరో ఆరుగురు వైకాపా కౌన్సిలర్లు సైతం లోపాయికారి ఒప్పందం మేరకు ఛైర్‌పర్సన్ ఎన్నిక జరిగితే గైర్హాజరు అవుతారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశం మేరకు సీనియర్ టిడిపి నాయకులు ప్రత్యేక బస్సులో కౌన్సిలర్లతో పాటు, కుటుంబ సభ్యులను క్యాంపుకు తీసుకెళ్లారు. ఎన్నికల కమిషన్ తేదీ ప్రకటించిన వెంటనే నేరుగా కౌన్సిలర్లను మున్సిపల్ కార్యాలయానికి తీసుకుని వచ్చేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్యాంపునకు వెళ్లిన 24 మంది కౌన్సిలర్లతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే ఓటుతో తెలుగుదేశం పార్టీకి 26 సంఖ్యాబలం ఉండడంతో ఆ పార్టీ ఛైర్మన్‌గా డిఈ.రమేష్ కుమార్ ఎన్నిక లాంఛనమే. ఎన్నిక సజావుగా జరిగితే తిరిగి మున్సిపాలిటీలో తెలుగుదేశం పాగా వేయడం ఖాయం.

రైల్వే వంతెనల పూర్తికై వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

రైల్వే అధికారితో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రైల్వే వంతెనలను సత్వరం పూర్తి చేయాలని రాయదుర్గం శాసన సభ్యులు కాలవ శ్రీనివాసులు రైల్వే ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడు బెంగళూరులో నైరుతి రైల్వే బెంగళూరు డివిజన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అజయ్ శర్మను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో రాయదుర్గం పట్టణంలో అనంతపురం - కణేకల్లు రహదారులపై రెండు రైల్వే వంతెనల పనులను ప్రారంభించిన విషయాన్ని ఆయనకు గుర్తు చేశారు. సదరు రెండు వంతెనలు అర్ధాంతరంగా ఆగాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ రెండు వంతెనలకు అయ్యే ఖర్చును రైల్వే శాఖ భరించి వాటిని పూర్తి చేయించాలని కోరారు. రాయదుర్గం గొల్లపల్లి రోడ్డులో కూడా రైలు వంతెన నిర్మాణం అవసరం ఉందన్నారు. ఈ పనులకు కావాల్సిన నిధులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో మంజూరయ్యే విధంగా ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు పంపాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రైల్వే ముఖ్య పాలనాధికారితో జరిగిన సమావేశంలో రైల్వే చీఫ్ ఇంజినీర్ సరోజ్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ మూర్తి రాజులు పాల్గొన్నారు.

హోంమంత్రి వంగలపూడి అనితకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, మాజీ మేయర్ మదమంచి స్వరూప

అనంతకు రాష్ట్ర హోంశాఖ మంత్రి

నేడు డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్
పాల్గొననున్న మంత్రి అనిత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, మాజీ మేయర్ మదమంచి స్వరూపలు ఘన స్వాగతం పలికారు. సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన హోం శాఖ మంత్రి అనితకు సప్తగిరి సర్కిల్ అలెగ్జాండర్ హోటల్ వద్ద ఎమ్మెల్యేలు, ఎంపీలు పుష్పగుచ్చాలు అందజేసి బాణాసంచాలు పేల్చి ఘన స్వాగతం పలికారు. టిడిపి నాయకులు కార్యకర్తలు హాజరై మంత్రికి స్వాగతం పలికారు. నేడు పిటిసిలో డీఎస్పీల పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమంలో భాగంగా అనంతపురానికి ఆమె విచ్చేశారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మంత్రిని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీతో మంత్రి సమావేశమయ్యారు. అనంతపురం నగరంలో శాంతిభద్రతలతో పాటు పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు.

ప్రభాకర్ చౌదరి నివాసంలో మంత్రికి తేనేటి విందు

అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి నివాసంలో ఏర్పాటు చేసిన తేనేటి విందుకు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హాజరయ్యారు. రామ్‌నగర్‌లోని చౌదరి నివాసం వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై మంత్రికి స్వాగతం పలికారు. చౌదరి కుటుంబ సభ్యులు మంత్రికి సాదరంగా ఆహ్వానించారు. చౌదరితో పాటు టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే బండారు శ్రావణి, మాజీ ఎమ్మెల్యేలు జితేంద్రగౌడ్, పల్లె రఘునాథ్‌రెడ్డి, టిడిపి నేతలు మంత్రికి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల తరువాత చౌదరి నివాసం వద్ద మంత్రి రాకతో సందడి నెలకొంది.

బదిలీ ప్రక్రియ ఆపాలని ట్రాన్స్‌కో ఎస్ఇకి వినతి

ప్రజాశక్తి అనంతపురం

నూతన విధానాలను తీసుకొచ్చి చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ఆపాలని ఎపి రాష్ట్ర ఎలక్ట్రిసిటీ కంపెనీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం నాడు స్థానిక ఎస్పీడీసీఎల్ భవన్‌లోని కార్యాలయంలో ఎస్ఇని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఎస్పీడీసీఎల్ సంస్థ ఉద్యోగుల విషయంలో మరోసారి ఆలోచించాలన్నారు. అనాలోచిత నిర్ణయాల వల్ల చిరు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే ఏపీ ఎస్పీడీసీఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. ఎస్ఇని కలిసిన వారిలో కాంట్రాక్టు ఉద్యోగులు వెంకటేష్, బాబు, నాగార్జున, అమర్నాథ్‌రెడ్డి, సుజాత, ధనలక్ష్మి, భారతి, శివ, పవన్, సుధాకర్, తదితరులు ఉన్నారు.

ఆర్డీవోగా గుత్తా కేశవ నాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం

బాధ్యతలు స్వీకరిస్తున్న కేశవ నాయుడు

అనంతపురం ఆర్డీవోగా గుత్తా కేశవ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు జిల్లాలో వివిధ హోదాల్లో పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆర్డీవోగా ఆయన మరోసారి జిల్లాకు వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తెలిపారు.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ అధికారులకు సూచించారు. సోమవారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ ఏ.మలోలతో కలిసి ప్రజల నుంచి 383 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. అనంతరం పింఛన్ల పంపిణీలో ఉత్తమ పనితీరు కనపరచిన ఎంపిడిఒలు, మండల నోడల్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి సర్టిఫికెట్ల అందజేశారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్పొరేషన్ నుంచి హిందూపురానికి చెందిన మాస్కీర్‌కు క్యాలిపర్ కృత్రిమ కాళ్లను, గుడివాండ్లపల్లికి చెందిన జయమ్మకు (ఎడమ), ముదిగుబ్బ మండలం ఈదలవారిపల్లికి చెందిన శ్రీరాములుకు కృత్రిమ కాళ్లను జాయింట్ కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఇఓ వెంకటసుబ్బయ్య, డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య, హార్టికల్చర్ డిడి నరసింహారావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, ఏపీఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, సిపిఒ అశోక్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్, అసిస్టెంట్ కలెక్టర్లు

విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్ల దొంగలను పట్టుకోండి...

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతుల విద్యుత్ మోటార్లు, స్టార్లర్లు, పైపులు, కేబుల వైర్ల చోరీకి పాల్పడుతున్న దొంగలను అరికట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు జిల్లాలో వర్షాభావం సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. బోర్లు వేసుకుని అరకొర పంటలు పండించే రైతులకు విద్యుత్ మోటార్‌లు, తదితర పరికరాలు, వైర్లు దొంగతనాలకు గురికావడంతో తీవ్ర ఆందోళనలో రైతులు కూరుకుపోతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి దొంగలను వెంటనే పట్టుకోవాలని, దొంగతనాలు పునరావృతం కాకుండా వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధిత ఫిర్యాదులను జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ, ఏ.మలోల, ఆయా శాఖల అధికారులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 383 అర్జీలు వచ్చాయి. అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసి ఆదేశించారు. అంగన్‌వాడీ ప్రాజెక్టుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శకుంతల, జె.రమాదేవి జేసిని కలిసి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ షాపుల నుంచి బియ్యం సరుకులు సరఫరా చేయడం లేదు. తమ సొంత డబ్బులతో అంగన్‌వాడీలు తెచ్చుకునే పరిస్థితి ఉందని తక్షణమే ఎండిఎం వాహనాల ద్వారా సరుకులు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలకు బకాయి బిల్లులు చెల్లించాలని కోరారు. అంగన్‌వాడీలకు పించన్ పంపిణి విధులు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎస్సీ హాస్టల్ నిర్వహణకు భవనం అద్దెకు తీసుకోవాలని ప్రజావతి భర్త తిప్పరెడ్డి జేసికి విన్నవించారు.

జెసికి సిఐటియు, రైతుసంఘాల వినతి

అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

6న 'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్ధు ఎస్కెయు అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, వంశీ డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వతేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో కలెక్టరేట్‌కు సంబంధించిన పోస్టర్లను సోమవారం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం రోజురోజుకీ మరుగున పడుతోందన్నారు. ప్రధానంగా ప్రభుత్వ విద్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఆదుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ముఖ్యంగా పెండింగ్‌లోఉన్న వసతిదీవెన, విద్యాదీవెనకు రూ.3,480కోట్లు విడుదల చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, హాస్టల్ సొంత భవనాలు కేటాయించి మెస్‌ఛార్జీలు నెలకు రూ.3వేలకు పెంచాలని, డిగ్రీ కళాశాలల్లో మేజర్, మైనర్ హానర్స్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో 77ను రద్దుచేసి పీజీ చదివే విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఈనెల 6న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నాలో విద్యార్థులు, విద్యావంతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాముడు, మోహన్, సాయి, హర్ష, శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పోస్టులు పెంచాలని ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఉపాధ్యాయ పోస్టుల సంక్య పెంపుదల చేసి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిఎస్సీ అభ్యర్థులు డిమాండ్ చేశారు. సోమవారం డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులు కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. అంతకు మునుపు నగరంలో ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలక్రిష్ణ, నూరుల్లా, ఎఐవైఎఫ్ నాయకులు సంతోష్, డిఎస్సీ అభ్యర్థులు రమేష్ చౌదరి, ఉజీబ్, వెంకటేష్ మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడానికి నిరుద్యోగ యువత ఓట్లు చాలా కీలకంగా నిలిచాయని, నూతన ప్రభుత్వం ఏర్పాటైతే ఉద్యోగాలు వస్తాయని ఆశించామన్నారు. తీరా చూస్తే కరువు జిల్లాకు చాలా తక్కువ పోస్టులు డిఎస్సీ నోటిఫికేషన్‌లో పొందుపరిచారని తెలిపారు. కరువు జిల్లాకు నిధులు కేటాయింపులోనూ, ఉద్యోగాల భర్తీలోనూ పాలక ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వం డిఎస్సీ పోస్టుల భర్తీపై తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. తక్షణమే స్పందించి జిల్లాకు డీఎస్సీలో వెయ్యి పోస్టులు కేటాయించాలన్నారు. 117 జిఓ రద్దు చేసి దానికి అనుగుణంగా ఎస్జీటిలను నియమించాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ద్వితీయ నియామకం చేపట్టాలన్నారు. జిల్లాకు ఒక పరీక్ష పత్రంలో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయాన్ని పోలీసులు జెసి శివ్‌నారాయణశర్మకు చెప్పవడంతో అభ్యర్థులతో మాట్లాడాలని డిఆర్ఓ మలోలకు సూచించగా అభ్యర్థుల వద్దకు వచ్చి అర్జీ స్వీకరించారు. దీంతో ఆందోళన విరమించారు.

రాస్తారోకో చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

గుంతల రోడ్ల నుంచి ప్రజలకు విముక్తి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత ఐదేళ్ల ఐదేళ్ల వైసిపి పాలనలో గుంతల రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విముక్తి కల్పిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నియోజకవర్గంలోని రుద్రం పేట పంచాయతీ నుంచి తగరకుంట వెళ్లే మార్గంలో గుంతలు రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా రోడ్లు ఎంత మేర దెబ్బతిన్నాయి.. పనులు ఎలా జరుగుతున్నాయన్న విషయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మార్గంలో వాహనాలు వెళ్లాలంటే గుంతలు రోడ్డు చూసి జంకేవారన్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో రహదారులు ఇలానే ఉన్నాయన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.860కోట్లతో మిషన్ పాత్ హోల్స్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఆ నిధులతో త్వరలో గుంతలు లేని రహదారులను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్బి అధికారి కాటమయ్య, టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్, మాజీ ఎంపిపి శ్రీనివాసరెడ్డి, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, టిడిపి నాయకులు భక్తవత్సలం నాయుడు, ఎస్ఎం.బాషా, కొత్తకోట ఖాసీం, వెంకటరాముడు, బోయపాటి బాలప్ప, కనకలపాటి కరుణాకర్, దబ్బర కొండయ్య, సుధాకర్, ఉప్పర ఆది, తలారి పోతులయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టవర్క్లాక్ బ్రిడ్జిని నిత్యం శుభ్రంగా ఉంచాల్సిందే..

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

టవర్క్లాక్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

నగరంలోని టవర్క్లాక్ వద్ద ఉన్న బ్రిడ్జిని రోజూ శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకోవాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. సోమవారం నగరంలోని లక్ష్మీనగర్, కోవూరునగర్, మారుతీనగర్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. డ్రైనేజీలు శుభ్రంగా ఉంచడంతోపాటు ఎక్కడ నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇందులో భాగంగా టవర్క్లాక్ బ్రిడ్జిపై చెత్త, చెత్తకుప్పలు ఉంచడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను ఎత్తకుండా అలాగే ఉంచితే గాలికి మళ్లీ రోడ్డుపైకి వస్తుందన్నారు. కావున చెత్తను వెంటనే ఎత్తివేయాలని ఆదేశించారు. అనంతపురం అనగానే టవర్క్లాక్తోపాటు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన బ్రిడ్జి గుర్తుకు వస్తుందన్నారు. ఈ రెండూ అనంతపురానికి ఐకాన్లు అన్నారు. కావున వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇకపోతే దోమలు లేకుండా ఫాగింగ్ ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లా, కమల్భూషణ్, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యం స్థాయిని పెంచాలి

జిల్లా సూక్ష్మ సేద్య అధికారి బి.రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఫిటర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

జిల్లాలో సూక్ష్మ సేద్యం స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా సూక్ష్మ సేద్య అధికారి బి.రఘునాథరెడ్డి సూచించారు. సోమవారం నగరంలోని ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో డ్రిప్పు పరికరాలను పొలంలో అమర్చు నూతన ఫిట్టర్లపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిటర్లు ఎలా అమర్చాలనే విషయాలపై శ్రద్ధగా అవగాహన పెంచుకుని ఎపి సూక్ష్మ సేద్య పథకం స్థాయిని పెంచాలని సూచించారు. అలాగే డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం రైతు 'సొంత నమోదు' ద్వారా తమకు నచ్చిన కంపెనీ సెలెక్ట్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. ఈ విషయాన్ని ప్రతి రైతుకూ చేరవేయాలన్నారు. సబ్జెక్ట్ ఎక్స్ఫర్ట్ దిలిప్కుమార్ మాట్లాడుతూ 2023 నుంచి ఇప్పటి వరకూ ఎపి ఎంఐపి సాఫీగా అమలవుతోందన్నారు. మైక్రో ఇరిగేషన్ వల్ల నీరు, కరెంటు, కూలి ఖర్చు ఆదా అవుతాయన్నారు. అలాగే ఫెర్టిగేషన్ పద్ధతిలో ఎరువులు పంపడం వల్ల ఎరువులు ఆదా అవుతున్నాయన్నారు. అనంతరం ఫిట్టర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెటాఫిమ్ కంపెనీ అగ్రానమిస్ట్ రమణారెడ్డి, ఎపిడి ఫిరోజ్ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి

ముఖ్య అతిథికి బహుమతి అందజేస్తున్న గేట్స్ సిబ్బంది

ఇంజినీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉద్యోగాలు లభిస్తాయని జెఎన్టియు సిఎస్ఇ విభాగం ప్రొఫెసర్ శోభాబిందు సూచించారు. గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగమం ఆధ్వర్యంలో సిఎస్ఇ విద్యార్థులకు వారం రోజులపాటు జరిగిన డేటా డైనమిక్స్ అనే సదస్సు సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ప్రతిదీ డేటాపై ఆధారపడిందన్నారు. డేటా అనలైజర్స్ ఆవశ్యకత భవిష్యత్తులో చాలా కీలకమన్నారు. కళాశాలలో తరచూ వర్క్ షాపులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి జి.రఘునాథ్రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ నమ్రత పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో శ్రీచైతన్య ఎజిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఈ సంవత్సరం 668 ఫార్ములాలకు సంబంధించిన ప్రపంచ రికార్డు కోసం 10వేల మంది విద్యార్థులు 20 రాష్ట్రాలు నూరు రోజుల శిక్షణ, 120 క్యాంపస్లు మరో శ్రీనివాస రామానుజన్లాగా చరిత్ర సృష్టిస్తున్న బాల మేధావులు మన శ్రీచైతన్య పాఠశాల నుంచి పాల్గొనడం గమనార్హమని ఎజిఎం సుబ్బారెడ్డి అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం అభినందించారు. విద్యార్థులకు ఎన్నో అమూల్యమైన నైపుణ్యాలను అందించి ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో అన్నిరంగాల్లో మహోన్నతమైన వ్యక్తులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 6న బుధవారం జరగబోయే వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు స్థలం సర్వే

గుంతకల్లు : పట్టణ శివారులోని ఆలూరు రోడ్డులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు చెందిన స్థలాన్ని మంగళవారం సర్వే చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ మహమ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో సమ్మర్ స్టోరేజ్ వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైందని మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ కోడెల అపర్ణ, భర్త, టిడిపి నాయకులు కోడెల చంద్రశేఖర్ సంయుక్తంగా తమకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చుట్టూ నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రజలు హాజరు కావాలని కోరారు.

మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

డ్రగ్స్కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కోనంకి శ్రీధర్ సూచించారు. సోమవారం పట్టనంలోని బిసి ప్రభుత్వ బాలుర వసతి గృహంలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దూరంగా ఉంటూ వ్యతిరేకంగా యువత పోరాడాలని పిలుపునిచ్చారు. అంతేగాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని అనారోగ్యం పాలుకాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ గంగాధర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు రవిశంకర్, హెచ్డబ్ల్యుఒ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేస్తామని సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఓ.నల్లప్ప స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలో సిపిఎం మండల మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం గత మూడేళ్ల క్రితం మహాసభలో తీసుకున్న కర్తవ్యాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం టిడిపి, జెడియు మద్దతుతో కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందన్నారు. ప్రజలను బికారులుగా చేస్తోందన్నారు. ఈనేపథ్యంలో ప్రజల్లో వస్తున్న అసంతృప్తి, వ్యతిరేకతను దారి మళ్లించడానికి జమిలి ఎన్నికలు, మతోన్మాదాన్ని పెంచి పోషించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మద్యం వ్యాపారాన్ని పెంచేందుకు ఏర్పాటు చేస్తున్న బెల్ట్షాపులను నియంత్రించాలన్నారు. పాలకులు మేల్కొనకపోతే ప్రజల్లో తిరుగుబాటు వస్తుందన్నారు. జిల్లాలో సాగునీటి సమస్యను పరిష్కారం చేయకుండా రైతాంగాన్ని, ప్రజలను కాపాడుకోలేమన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో సిపిఎం ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆర్.కుళ్లాయప్ప, శివారెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్య, నాగరాజు, చంటి నాగేంద్ర, నెట్టికంటయ్య, సంజీవరెడ్డి, చెన్నప్ప, నడిపక్క వెంకటలక్ష్మి, హరికృష్ణ, వేణుగోపాల్, వెంకట్ కొండ, ఎర్రకొండప్ప, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలను కరువు మండలంగా ప్రకటించాలి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-శింగనమల

తహశీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

శింగనమల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులు, కూలీలను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్లో అతివృష్టి, అనావృష్టి వల్ల జిల్లాలో సాగు చేసిన పంటలు పూర్తిగా నాశనమయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లాలోని కేవలం ఏడు మండలాలు మాత్రమే ఉన్నాయన్నారు. మిగిలిన 24 మండలాల్లోనూ కరువు ఛాయలు అలుముకున్నాయన్నారు. కావున ఆయా మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించి పంట నష్ట పరిహారం అందించాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పనిదినాలు కల్పించి రూ.600 కూలి పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం సంఘం మండల కార్యదర్శి కొండారెడ్డి, రైతుసంఘం మండల నాయకులు శ్రీనివాసులు, బాలరాజు, లక్ష్మీనారాయణ, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఒపి పోలీస్స్టేషన్ను ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు

డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలోని ఆర్అండ్బి కూడలిలో మూసేసిన ఒపి పోలీస్స్టేషన్ను తిరిగి ప్రారంభించి ట్రాఫిక్ను నియంత్రించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులుకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్అండ్బి సర్కిల్ రహదారిలో సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకూ ట్రాఫిక్ స్తంభిస్తోందన్నారు. ఈ మధ్యకాలంలో ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ దారి నుంచే రైల్వే ఉద్యోగులు, రైల్వేస్టేషన్ వెళ్లే ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ ట్రాఫిక్ను నియంత్రించాలంటే మూతబడిన ఒపి పోలీస్స్టేషన్ను తిరిగి ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, వైటి చెరువు రమేష్, తిమ్మప్ప, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎంత అణగదొక్కితే అంత లేస్తాం..!

భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న కూటమి ప్రభుత్వం-వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

'బంతిని ఎంత బలంగా కొడితే అంత బలంగా పైకి లేస్తుంది... అధికారం ఉంది కదా అని ప్రతిపక్షాన్ని అణగదొక్కాలని చూస్తే అంతే బలంగా లేస్తాం..' అంటూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సూపర్ సిక్స్ హామీల అమలులో వైఫల్యం చెందారన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతుంటే అన్యాయంగా, అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా వైసిపి శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. చిలకలూరిపేటలో మహిళా నేత కృష్ణవేణి, సోషల్ మీడియా కార్యకర్త ఇంటూరి కిరణ్, సత్యసాయి జిల్లా రొద్దంలో బాలాజిరెడ్డి, ఉదయగిరిలో సోషల్ మీడియా కన్వీనర్లను అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా లోకేష్ రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అందుకు విరుద్ధంగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. విదేశాల్లో ఉన్న లోకేష్ రెడ్ బుక్ థర్డ్ చాప్టర్ ఓపెన్ చేస్తామంటూ వ్యాఖ్యానించడం బ్లాక్ మెయిల్ చేయడమేనన్నారు. మీలాంటి వాళ్లను ఎంతో మందిని చూశామని, ఎవరికీ భయపడే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రజల తరపున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే మద్యం, ఇసుక అక్రమ రవాణా చేస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ పెడతామని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబు చెప్పే మాటలకు అర్థాలు వేరని.. ఆయన అవునంటే కాదని, కాదంటే అవునని అర్థమని ఎద్దేవా చేశారు. వైసిపి తరపున 11 మంది ఎమ్మెల్యేలే ఉండొచ్చని, ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు టిజెఆర్ సుధాకర్బాబు, తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం : పొట్టేళ్ల పెంపకంలో కాపరులు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కెవికె పశువిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ హరిణి సూచించారు. సోమవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో కెవికె కోఆర్డినేటర్ చినరాయుడు ఆధ్వర్యంలో పొట్టేళ్ల పెంపకం రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పొట్టేళ్లకు గొర్రెలకు సోకే వ్యాధులు, నివారణ చర్యలపై క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా జ్వరం, చిగుళ్ల వాపు, నోటి లోపల నాలుక మీద కణతులు, నాలుక చీలిక తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. రైతులు ముందుగా గుర్తించి నివారణ పద్ధతులను చేపట్టాలన్నారు. ట్రైకోడెర్మా సుడోమాన్ పాడి, ధ్రువ మందులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని కోరారు.

బ్రహ్మసముద్రం ఎస్ఐగా నరేంద్రకుమార్

బ్రహ్మసముద్రం : మండల నూతన ఎస్ఐగా నరేంద్రకుమార్ సోమవారం స్థానిక పోలీస్స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ పరశురాముడు చిత్తూరు జిల్లా మదనపల్లి బైరెడ్డిపల్లి పోలీస్స్టేషన్కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నరేంద్రకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో తనవంతు ప్రజా శ్రేయస్సుకు కృషి చేస్తానన్నారు. కాగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రకుమార్కు స్టేషన్ పరిధిలోనే పోలీసులు, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

జిల్లాలోని హంద్రీనీవా, హెచ్చెల్సీ కాలువల వెడల్పుతోపాటు మరమ్మతులు చేయడానికి బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఎం ఉరవకొండ కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం హంద్రీనీవా కాలువకు 4వేల క్యూసెక్కులు మాత్రమే నీరు వస్తోందన్నారు. కాలువను వెడల్పు చేయడంతోపాటు మరమ్మతులు చేస్తే 6వేల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా నియోజకవర్గంతోపాటు జిల్లావ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలను నింపాలన్నారు. పిల్ల కాలువల్లో మరమ్మతులు చేపట్టి రైతులందరికీ సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపోతే జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజనేయులు నాయక్, సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ధ్యేయం

రిడ్స్ సంస్థ కళ్యాణదుర్గం ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్

ప్రజాశక్తి-ఉరవకొండ

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, వైద్యసిబ్బంది, విద్యార్థులు

ఎయిడ్స్ రహిత అనంతపురం జిల్లాగా తీర్చిదిద్దడమే రిడ్స్ సంస్థ ధ్యేయమని సంస్థ కళ్యాణదుర్గం ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల సోమవారం మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కళ్యాణదుర్గం ఆధ్వర్యంలో ఉరవకొండ కరిబసవేశ్వర పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వీరన్న, ఎఎన్ఎం వరలక్ష్మి, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు షకీలా, మౌనిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

హోంమంత్రి అనితకు పూలమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, నాయకులు

జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పూల మొక్క అందజేశారు. అనంతరం పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలోని పోలీసుస్టేషన్లలో పోలీసు అధికారులకు కొత్త వాహనాలను మంజూరు చేయాలని, స్టేషనరీ సామగ్రి కోసం నిధులు పెంచాలని, జనాభాకు తగ్గట్టుగా అదనపు పోలీసులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరి కిన్నెరశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, మాజీ జడ్పీటిసి రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గుత్తి విద్యార్థి

గుత్తి : ఆర్ఎస్లోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సాయికిరణ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. అనంతపురంలోని ఆర్డిటి స్టేడియంలో ఎస్జిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 2వతేదీన జరిగిన అథ్లెటిక్స్ అండర్ 14 విభాగంలో సాయికిరణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఏలూరు జిల్లా ఉంగటూరులో ఈనెల ఆరవ తేది నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక చేశారు. సోమవారం సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని మేషర్మియా, పిఇటి రంగనాయకులు అభినందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బ్రహ్మసముద్రం :

సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచి వనిత మల్లికార్జున, పిఆర్ ఇంజినీర్ విజయ్కృష్ణ

మండలంలోని కొండాపురం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను సర్పంచి మల్లెల వనిత మల్లికార్జున సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండల పంచాయతీ రాజ్ శాఖ అధికారి విజయ్కృష్ణతో కలిసి నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా పనులను నాణ్యతగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ఛార్జి ఓబులేసు, ఇంజినీరింగ్ సహాయకులు లలిత, మాజీ ఎంపిటిసి కరేగౌడ, నారాయణ స్కూల్ కమిటీ ఛైర్మన్ కరేగౌడ, అక్కన్న, దండు తిప్పేస్వామి, వెంకటేశులు, లక్ష్మన్న, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్మేళాలో 28 మంది ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్ : బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 28 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్కుమార్ తెలిపారు. జాబ్మేళాలో 68 మంది అభ్యర్థులు పాల్గొనగా చోళ మండలం ఇన్వెస్ట్మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ, శ్రీధర్ పిసిఇ, హెచ్డిఎఫ్సి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులకు ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

యల్లనూరు : మండల పరిధిలోని పెద్దమల్లేపల్లి గ్రామ సమీపంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా వాహనాల రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని వాహనాల యజమానులకు అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, వైద్యసిబ్బంది, విద్యార్థులు

బొమ్మనహాల్ : మండలంలోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు మల్లేశ్వరి సూచించారు. మండలంలోని దేవగిరి గ్రామంలో అంగన్వాడీ వర్కర్లు, వైద్యసిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యసిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చలిజ్వరం, ఒళ్లనొప్పులు, ఆకలి, దప్పిక తక్కువ, ఎక్కువ నీరసం ఉన్నవారందరూ మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అలాగే తాగునీటిని వేడి చేసుకుని చల్లార్చుకుని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

యాడికి : మండలంలో అదనంగా ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జనసేన మండల కన్వీనర్ సునీల్కుమార్ కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండల కేంద్రంలో ఒక్క ఆధార్ కేంద్రం మాత్రమే ఉందన్నారు. దీంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే అదనపు ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు జాకీర్హుస్సేన్, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, శివ, మధుయాచారి, బాబు, అల్లా, ఓబయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు

నార్పల : వ్యాసరచన పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సోమవారం మండల పరిధిలోని బి.పప్పురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అనంత ప్రగతి గ్రామీణ బ్యాంకు సౌజన్యంతో 'అవినీతి నిర్మూలన–పౌరుల బాధ్యత' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిచారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాఘవేందరరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పాఠశాల ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, పాఠశాల హిందీ పండితులు జూటూరు షరీఫ్, ఉపాధ్యాయులు నాగరాజు, వెంకట నాయుడు, కొండారెడ్డి, శశికళ, పవిత్ర, రామన్న, తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

ఆటస్థలంలో కంపచెట్లు తొలగించాలి

పుట్లూరు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ఆటస్థలంలో పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించాలని మండల కేంద్రానికి చెందిన యువకులు కోరారు. ఈమేరకు ఎంపిడిఒ అలివేలమ్మకు స్థానిక కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఆలస్థలంలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడం వల్ల మల, మూత్ర విసర్జన చేయడంతోపాటు మందుబాబులకు అడ్డాగా మారుతోందన్నారు. కావున అధికారులు స్పందించి ఆటస్థలంలో కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యువకులు రవి, సురేంద్ర, తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉన్న స్కిల్ హబ్ సెంటర్లో మూడు నెలల అసోసియేట్ కస్టమర్ కేర్ (వాయిస్ అండ్ నాన్ వాయిస్) కోర్సు చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఎంబిఎ, ఎం.కాం మొదలైన కోర్సులు చదివి ఉండి అసోసియేట్ కస్టమర్ కేర్ కోర్సు చేయడానికి ఈనెల 16వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 91829 20381 నెంబర్ను సంప్రదించాలని కోరారు.

రేషన్ కార్డుదారులందరూ ఉచిత గ్యాస్కు అర్హులే...

నార్పల : రేషన్కార్డు కలిగి గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు అందరూ ఉచిత గ్యాస్ పథకాన్ని అర్హులే అని సిఎస్డిటి చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రేషన్కార్డుదారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అంతేగాకుండా ఉచిత గ్యాస్ కోసం ఎలాంటి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ కనెక్షన్, ఆధార్, రేషన్కార్డు కలిగి ఉండటంతోపాటు ఇకెవైసి చేయించుకుంటే తప్పనిసరిగా లబ్ధిదారుల అకౌంట్లో నేరుగా డబ్బులు జమ అవుతాయన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

శింగనమల : మండల పరిధిలోని తరిమెల గ్రామంలో నివాసం ఉంటున్న పూజారి లక్ష్మీదేవి, పూజారి పెద్దన్న కుమారుడు చిన్న నల్లప్ప వివాహనికి కంచిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచిరెడ్డి కరుణాకర్రెడ్డి, భాస్కర్రెడ్డి సోమవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం అందించడం ఎంతో సంతోషకరమన్నారు. వారి వైవాహిక జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న శివకృష్ణచౌదరి

నార్పల : మండలంలోని బొందలవాడ గ్రామానికి చెందిన మెల్లంపూటి శివకృష్ణచౌదరి సోమవారం నియోజకవర్గంలో మొట్టమొదటి టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సుమారు రూ.లక్ష చెల్లించి ఆన్లైన్ ద్వారా సభ్యత్వాన్ని తీసుకున్నారు. శివకృష్ణచౌదరి దాదాపు 20ఏళ్లుగా వివిధ స్థాయిల్లో పార్టీకి సేవలు అందిన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

పలువురు బాధితులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం నగరంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలో 7 మందికి రూ.8.71లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పేదల ఆరోగ్యం విషయంలో చంద్రబాబు ఆర్థిక భారం చూడటం లేదన్నారు. అంతేగాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే దీపావళికి దీపం కానుక ఇచ్చారన్నారు. అలాటే ప్రతిఇంట్లో పారిశ్రామిక వేత్త, ఓ సాఫ్ట్వేర్ ఇంజనీర్ను తయారు చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యమన్నారు.

అనంతపురంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



గుంతకల్లులో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

గుంతకల్లు : నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోమవారం కసాపురం రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోపే సుమారుగా రూ.9,21,718 చెక్కులను లబ్ధిదారులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నియోజకవర్గంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ కూడలిలో డ్రెయినేజీ నిర్మాణం

కళ్యాణదుర్గం రూరల్ : ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ ప్రత్యేకమైన చొరవతో కళ్యాణదుర్గం పాత బస్టాండ్ కూడలిలో డ్రెయినేజీ నిర్మాణం పనులు చేపట్టారు. ఉదయం ట్రాఫిక్ రద్దీగా ఉంటుందని రాత్రి 10గంటల సమయంలో డ్రెయినేజీ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డ్రెయినేజీ పనులను చేస్తున్న జెసిబి

శింగనమల చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయాలి

తహశీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీరంగ రాయల సేవాసమితి సంఘం నాయకులు

శింగనమల : మండల కేంద్రంలోని శ్రీరంగరాయ చెరువు వద్ద ఉద్యానవనం ఏర్పాటు చేయడంతోపాటు బోటింగ్ ఏర్పాటు చేయాలని శ్రీరంగ రాయల సేవా సమితి సంఘం నాయకులు జక్కల రామ్చరణ్ యాదవ్ కోరారు. ఈమేరకు శ్రీరంగ రాయల సేవా సమితి సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల చెరువు సమీపంలో సర్వే నెంబర్ 96లో ప్రభుత్వ ఖాళీ స్థలం ఉందన్నారు. ఇక్కడ ఆ స్థలంలో ఉద్యానవనం ఏర్పాటు చేసి బోటింగ్ సౌకర్యం కల్పిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి ఉద్యానవనం ఏర్పాటు చేయడంతోపాటు బోటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగ రాయల సేవా సమితి సంఘం సభ్యులు రమణారెడ్డి, వెంకటేశు, ఆదెన్న, నాగరాజు పాల్గొన్నారు.

ఇళ్లపై విద్యుత్ వైర్లను మార్చాలి

పుట్లూరు : మండలవ్యాప్తంగా గ్రామాల్లో ప్రమాదకర స్థాయిలో ఉన్న, ఇళ్లపై వెళ్తున్న విద్యుత్ వైర్లను తొలగించాలని ఎపి రైతుసంఘం, ఎపి కౌలు రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో మండల డిప్యూటీ తహశీల్దార్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఎల్లుట్ల, నారాయణరెడ్డిపల్లి, సూరేపల్లి, తదితర గ్రామాల్లో ఇళ్లపై విద్యుత్ వైర్లు వెళ్తున్నాయన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. కావున వెంటనే ఇళ్లపై వెళ్తున్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీటి రామాంజనేయులు, రైతుసంఘం మండల అధ్యక్షుడు టి.బాలగురవయ్య, రైతుసంఘం మండల ఉపాధ్యక్షుడు చిన్నకృష్ణుడు, రైతుసంఘం జిల్లా కమిటీ నాయకులు ఎన్.గోపాలకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న కుళ్లాయప్ప, రైతుసంఘం మండల సహాయ కార్యదర్శి టి.ఓబుళయ్య, రైతుసంఘం నాయకులు అంకిరెడ్డి, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అగాపే ఆశ్రమంలో అన్నదానం

యాడికి : చింతకుంట సోమన్న వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు విఆర్ఒ చింతకుంట సుధీర్బాబు భార్య అరుణ కుటుంబం సోమవారం మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న ఆగాపే ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన సంగా తేజస్విణి

అనంతపురం : జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితను ఆంధ్రప్రదేశ్ తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విణి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువా కప్పి స్వాగతం పలికారు.

హోంమంత్రిని సన్మానిస్తున్న సంగా తేజస్విణి

ఉత్తమ సచివాలయ సిబ్బందికి ప్రశంసలు

పుట్లూరు : మండలంలోని అరకటవేముల సచివాలయానికి చెందిన వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి.ప్రతిమ ఉత్తమ అవార్డు అందుకుంది. పింఛన్ల పంపిణీలో జిల్లాలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు డిప్యూటీ కలెక్టర్ శివ్నారాయణ్శర్మ అవార్డును అందజేశారు. పి.ప్రతిమను ఎంపిడిఒ అలివేలమ్మతోపాటు సచివాలయ సిబ్బంది, తదితరులు అభినందించారు.

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వెల్ఫేర్ పి.ప్రతిమ

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎఎన్ఎం సునీత

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న సునీతను సోమవారం పలువురు అభినందించారు. సునీత ఈనెల 1న అందరికంటే ముందుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సామాజిక పింఛన్లను పంపిణీ చేసి లక్ష్యాన్ని అధికమించారు. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. దీంతో ఎంపీడీవో ప్రభాకర్ కార్యాలయంలో సునీతను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్డి డి.శివాజీరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పింఛన్ల పంపిణీలో పామిడి మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపిన అధికారులను జాయింట్ కలెక్టర్ సన్మానించారు. కలెక్టర్ వినోద్కుమార్ ఆదేశాలతో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఒ తేజోష్ణకు జాయింట్ కలెక్టర్ ప్రోత్సాహక సర్టిఫికెట్ను అందజేశారు.

ప్రశంసాపత్రాలను అందుకుంటున్న పామిడి అధికారులు

కులవివక్షను రూపుమాపాలని వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గంలో కులవివక్షను రూపుమాపాలని ఎస్సీ, ఎస్టీ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్యాలయంలో ఆర్డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో నేటి వరకూ దళితులకు స్వేచ్ఛ, సమానత్వం లేదన్నారు. ఇప్పటికీ దళితులు చిన్నచూపు, అవమానాలకు గురవుతున్నారన్నారు. ఇటీవల కంబదూరు మండలంలోని కురాకులపల్లి, జల్లిపల్లి, చెన్నంపల్లి, అంకంపల్లి, బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లి, కళ్యాణదుర్గం మండలం గంగవరం వంటి గ్రామాల్లో కులవివక్ష బయట పడిన విషయం తెలిసిందే అన్నారు.

ఇప్పటికీ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి కులవివక్ష లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జెఎసి తాలూకా అధ్యక్షులు చెలిమప్ప, వన్నూరుస్వామి, చనమల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.